జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త
తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 21-06-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 51 పేజీలు: 4 వెల: రూ.7



## ఈసారైనా.. రైతు గెలిచేనా!

* గత ఏడాది కరువు ఓడించింది * జిల్లాలో తగ్గుతున్న వరి సాగు * గిట్టుబాటు కాని ధర * ప్రకృతి ప్రకోపంతో బీడుగా వదిలేస్తున్న అన్నదాతలు * వరి గిట్టుబాటు ధర రూ.500 రాష్ట్రమే పెంచాలని రైతుల డిమాండ్

**శ్రీకాకుళం, జూన్ 20 (వార్త):** వరి సాగంటే భయపడే పరిస్థితి వచ్చింది. అయితే అనావృష్టి, లేదంటే అతివృష్టి. వీటికి మించి సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో శ్రీకాకుళం జిల్లాలో వరి సాగు విస్తీర్ణం బాగా తగ్గుతోంది. గత ఏడాది కరువు పరిస్థితుల దృష్ట్యా ఈసారికి ఇతర పంటలు సాగు చేసుకుంటే మంచిదనే నిర్ణయానికి వచ్చారు. ఒకప్పుడు ఈ జిల్లాలో వరి సాగు బాగా ఉండేది. కానీ ఎరువులు, పురుగు మందుల ధరలు పెరగడంతో సాగు విస్తీర్ణం తగ్గించి వాణిజ్య పంటలపై రైతులు దృష్టి సారించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల వ్యవసాయ పంటలకు పెంచిన మద్దతు ధరల్లో భాగంగా వరికి తీవ్ర అన్యాయం జరిగిందంటూ రైతులు వాపోతున్నారు. గత ఏడాది 1.43 లక్షల హెక్టార్లలో మాత్రమే వరి పండించారు. జిల్లా సగటు 1.55 లక్షల హెక్టార్ల కంటే ఇది 8 శాతం తక్కువ. దాదాపు 28 వేల ఎకరాల్లో గత ఏడాది వరికి దూరమయ్యారు. ఫలితంగా 6,23,832 మెట్రిక్ టన్నుల దిగుబడి మాత్రమే సాధించారు. ఇదిలా ఉంటే వరిపై క్వింటాకు రూ.177 మాత్రమే పెంపు బిక్షం వేసినట్టు ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు రైతులు. కేజీ ధాన్యంపై 1.77 పైసలు పెంపు తీరును వారు తీవ్రంగా నిరసిస్తున్నారు. పెట్టుబడులు చూస్తే సంవత్సరానికి ఎకరానికి 2000 వరకు పెరుగుతుండగా వర్షా బావ పరిస్థితుల్లో దిగుబడులు ఎకరానికి 16 బస్తాలకు మించి రావట్లేదని రైతులు వాపోతున్నారు. యూరియా డిఏపి కాంప్లెక్స్ ఎరువులు ధరలు ప్రతి ఏటా 15 శాతానికి మించి పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, మద్దతు ధర మాత్రం 2 శాతానికి దాటట్లేదని ఏకరువు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది 1,61,500 హెక్టాలలో వరి సాగు లక్ష్యంగా నిర్ణయించగా 872100 క్వింటాళ్ళ దిగుబడి సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. గతసారి కంటే ఇది సాధించడం ఎంత వరకూ సాధ్యమో చూడాలి.

ప్రభుత్వాలు మారుతున్నా, రైతుల తలరాతలు మారట్లేదు. అయితే ఈసారి జిల్లా మంత్రిగా అచ్చం నాయుడు వ్యవసాయ శాఖకు మంత్రిగా ఉన్నారు. వ్యవసాయంతో పాటు వ్యవసాయ మార్కెటింగ్, మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖలకు మంత్రిగా ఉండటం, జిల్లాలో 70 శాతం మందికి పైగా ప్రధానంగా వ్యవసాయం పైనే ఆధారపడటంతో తమకు ఏదో ఒక మంచి జరుగుతుందని అంతా భావిస్తున్నారు. అలాగే జిల్లాకు చెందిన ఎంపీ కేంద్రమంత్రి హోదాలో ఉండటంతో ఇక్కడి రైతుల గోడును రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి విన్నవించాలని వారంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. పక్క రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం పెంచిన మద్దతు ధరతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కొంత మద్దతు ధరను ప్రకటించి రైతులను ఆదుకుంటున్నాయి. ఆ వరుసలో చత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాల్లో క్వింటా ధాన్యం 4000 వరకు మద్దతు ధరను అక్కడ ప్రభుత్వాలు ఇస్తున్నట్టు సమాచారం. ఈ విధానాన్ని కూడా రాష్ట్రంలో అమలు చేయాలని రైతన్నలు కోరుతున్నారు.

### విత్తనాలు సిద్ధం చేశాం

జిల్లాలో 36420 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం అవుతాయని గుర్తించాం. అందులో 29661 క్వింటాళ్లు సిద్ధంగా ఉండగా వీటిలో 14084 క్వింటాళ్ల విత్తనాలను ఇప్పటికీ పంపిణీ పూర్తి చేశాం. వరితో పాటు వాణిజ్య పంటల సాగుకు ప్రోత్సాహం కల్పించేలా కృషి చేస్తున్నాం.

**- కే.శ్రీధర్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి**

## వ్యవసాయాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్**



జిల్లాలో వ్యవసాయాభివృద్ధిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో వ్యవసాయం దాని అనుబంధ శాఖలైన హార్టికల్చర్, సెరికల్చర్, పశుసంవర్ధక శాఖ, ఫిషరీస్, మార్కెటింగ్, కో-ఆపరేటివ్, ఎపిఎంఐపి, వంశధార తదితర శాఖల గురించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసారి జిల్లాలో 1,82,325 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేసే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఇందులో వరి 1,61,500 హెక్టార్లు, మొక్క జొన్న 14000 హెక్టార్లు ప్రధానంగా సాగు చేయడం జరుగుతుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. విత్తన పంపిణీకి సంబంధించి 38,882 క్వింటాళ్లకు 31699 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, అందులో 16,904 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ పూర్తయిందని చెప్పారు. ఎరువులకు సంబంధించి 1,18,820 మెట్రిక్ టన్నులు జిల్లాకు కేటాయించడం జరిగిందని ఇందులో 33,000 మెట్రిక్ టన్నులు ఇప్పటి వరకూ పంపిణీ కోసం సిద్ధం చేయడం జరిగిందని, ఆర్బికేల ద్వారా త్వరితగతిన రైతులకు ఇవ్వడానికి ప్రణాళిక పూర్తి చేశామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈసారి అర్హులైన రైతులందరికీ పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. వంశధార ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుత పనుల వివరాలు, నీటి నిల్వ, ట్రిబ్యునల్ కేసుల ప్రస్తుత స్థితి గురించి సంబంధిత శాఖాధికారులు వివరించారు. అలాగే మడ్డువలస తోటపల్లి ప్రాజెక్టులలో ప్రస్తుత నీటిని నిలవ స్థితిని ఖరీఫ్ 2024-25 కార్యాచరణ గురించి చర్చించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, వ్యవసాయ శాఖాధికారి కే.శ్రీధర్, పశుసంవర్ధక శాఖ జెడి జయరాజు, వంశధార ఎస్ఈ రాంబాబు, నీటి పారుదల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్ రావు, మత్స్య శాఖ డిడి శ్రీనివాసరావు, మార్క్ ఫెడ్ డిఎం రమణి, సెరికల్చర్ ఆఫీసర్ రాజేంద్ర ప్రసాద్ బాబు, ఉద్యానవన శాఖాధికారి అర్.వి.వి.ప్రసాద్, మార్కెటింగ్ ఏడి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## కాటేస్తున్న.. పిడుగులు

* గాల్లో కలిసిన రెండు ప్రాణాలు * మరొకరు ఆసుపత్రిలో చికిత్స * రెండు పశువులు మృత్యువాత * బూర్జ మండలంలో విషాదం



**బూర్జ, జూన్ 20 (వార్త):** జిల్లాలో ఓ రెండు ప్రాణాలను పిడుగులు కాటేసింది. ఆయా కుటుంబాల్లో విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే.. బూర్జ మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసింది. టీడీఆర్‌రాజుపేటకు చెందిన చోడవరపు సత్యనారాయణ (25) కుటుంబ సభ్యులతో కలిసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఇదే సమయంలో ఆవును మేత కోసం పొలం లోకి తీసుకెళ్లాడు. ఆ సమయంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. ఒక్కసారిగా అతనిపై పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యనారాయణ ఇటీవలే విదేశాల నుంచి తిరిగి స్వగ్రామం వచ్చాడు. అతడిపై పిడుగు పడి చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. ఐదేళ్ల కిందట సింగపూర్ వెళ్లి ఓ కంపెనీలో వెల్డింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తల్లిదండ్రుల కోరిక మేరకు ఈ ఏడాది వివాహం చేసుకోవాలని ఇటీవలే తన స్వగ్రామమైన అయ్యవారిపేట చేరుకున్నారు. ఇంతలో విధి వక్రీకరించి ఈ విషాదం జరిగింది. మా ఇంటి దీపం ఆరిపోయిందని మృతుని తల్లిదండ్రులు చోడవరం లక్ష్మీనారాయణమ్మ, సూర్యనారాయణ బోరున విలపిస్తున్నారు. చోడవరపు సూర్యనారాయణ, మామిడి వెంకటరావుకు చెందిన రెండు ఆవులను పిడుగు బలి తీసుకుంది. ఈ ఘటనకు సమీపంలోనే మామిడి జగదీష్ అనే వ్యక్తిపై కూడా పిడుగు పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అలాగే కటకమయ్యపేట గ్రామంలో దేవరపల్లి బారికయ్య (65) అనే వ్యక్తిపై పిడుగుపడి మృతిచెందారు. పొలంలో పనులు చేస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



## దిగుమతి కాని.. విదేశీ జీడిపిక్కలు

* ఉద్దాన పిక్కలకు పెరిగిన మద్దతు ధర * 80 కేజీలు బస్తాకు 16 వేలు డిమాండ్ చేసిన రైతులు..



**పలాస, జూన్ 20(వార్త):** ఉద్దానం ప్రాంతానికి ప్రధాన జీవనాధారంగా పండిస్తున్న జీడిపంటకు మద్దతు ధర కోసం రైతులతో పాటు సంఘాలు పోరాడుతునే ఉన్నాయి. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇటీవల పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతి పత్రం కూడా ఇచ్చారు. అయితే మద్దతు ధరపై అటు పాలక పక్షం ఇటు పలాస జీడివర్తకులు రైతులకు స్పష్టత ఇవ్వడం లేదు. ప్రకృతి ప్రతికూల వాతావరణ వల్ల ఉద్దానంలో ఈ ఏడాది జీడిపంట దిగుబడి భారీగా తగ్గిపోయింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పలాస కు ఈ ఏడాది విదేశీ జీడిపిక్కలు దిగుమతి కూడా తగ్గింది. దీంతో ఉద్దానం జీడి రైతులు 80 కేజీలు జీడిపిక్కలు బస్తా రూ.16 వేలు ఇస్తేనే విక్రయిస్తామని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం 80 కిలో జీడిపిక్కలు బస్తా రూ.13వేలు నుంచి రూ.14వేలు వరకు ఉద్దానంలో కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. రైతులు చెప్పిన ధరకే జీడి పిక్క కొనుగోలు చేయాల్సివస్తోందని, పరిశ్రమలు నడవడం కష్టంగా మారుతోందని వ్యాపారులు చెబుతున్నారు.

## దళిత మహిళపై దాడి



**సంతబొమ్మాళి, జూన్ 20 (వార్త):** నరసాపురం పంచాయతీ మాల నరసాపురం గ్రామానికి చెందిన దళిత మహిళలపై దాడి చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం దళిత మహిళ ఎడ్ల ఈశ్వరి గురువారం ఉదయం కిరాణా షాప్‌కు వెళ్లగా అదే గ్రామానికి చెందిన ఆవాల సంతు, ఆవాల గోపి, ఇచ్ఛాపురం ఆనందరావు, చిన్ని శ్రీను, బి.మహాలక్ష్మి, బి.సుబ్బారావు లు కలిసి కులం పేరుతో దూషించి దాడి చేశారు. ఆ దాడిని అడ్డుకోవడానికి వచ్చిన మరో దళిత మహిళ జామి భారతిపై బండరాయితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన వారు కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సంతబొమ్మాళి పోలీసులు తెలిపారు. దళితులు మాపై దాడి చేశారంటూ మహాలక్ష్మి తదితరులు రిటర్న్ కంప్లైంట్‌ను సంతబొమ్మాళి పోలీసులకు అందజేశారు. ఇరువురు కంప్లీట్‌పై దర్యాప్తు చేసి చర్యలు చేపడతామని పోలీసులు తెలిపారు.

# రోడ్డు డెలివరికే మొగ్గు

*** గ్రామాల్లో డోర్ డెలివిరికు నో అంటున్నా పలాస హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ * దళారుల చెంతకు గ్యాస్ * గ్యాస్ తరలింపు వాహన డ్రైవర్ చేతుల్లో వినియోగదార్ల ఫోన్ నెంబర్లు * ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు * ఏజెన్సీ ప్రతినిధులపై సర్వత్రా విమర్శలు**





**పలాస, జూన్ 20(వార్త):** ప్రభుత్వం ప్రజలకు పథకాలు లబ్ధిదారులకు అందేలా అన్ని చర్యలు తీసుకుంటున్న ఆచరణలో అమలు కావడం లేదు. దేశానికీ పట్టు కొమ్మలు గ్రామాలే అన్న పెద్దలు మాటలను వమ్ము చేస్తూ ఇక్కడ గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్లకు ఇవ్వాలసిన పలాస హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ డోర్ డెలివరి ఇవ్వకుండా ఆయా గ్రామ కూడళ్ల వద్దకు గ్యాస్ వినియోగదారులను రప్పించుకొని వారికి ఇబ్బందులు పెడుతున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పలాస మండలంలోని గ్రామాలకు సంబంధించి హెచ్.పీ గ్యాస్ వినియోగదారులకు డోర్ డెలివరీ చేయకుండా రోడ్డు వద్దకు లబ్ధిదారులను పిలిపించుకొని గ్యాస్ సిలిండర్లు తనిఖీ చేయకుండా సరఫరా చేస్తున్నారు. నిజానికి గ్యాస్ సీల్ తీసి గ్యాస్ లీకు అవుతుందా లేదో తనికి చేయాల్సి ఉంది. కాని ఆచారణలో ఆలా జరగడం లేదని వినియోగదారులు తెలిపారు. వినియోగదారుడు గ్యాస్ అవసరం అని అన్లైన్లో బుక్ చేసిన లబ్ధిదారుల కు డోర్ డెలివరీ ఇవ్వాలసి ఉంది. కాని ఇక్కడ అలా పంపిణీ జరడం లేదు. గ్యాస్ బుక్ చేసిన వార్డు మెంబర్ నుంచి సీనియర్ సిటిజన్‌తో పాటు ఆఖరికి జర్నలిస్టు అయినా గ్యాస్ కోసం ఖాళీ బండతో ఎండలో రోడ్డు పక్కన గ్యాస్ కోసం ఎదురు చూడాల్సి ఉంది. గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ అందుతుందో లేదో నిబంధనలు ప్రకారం గ్రామాల్లో అమలు జరుగుతుందో లేదో వాటి పంపిణీపై ఆ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల పర్యవేక్షణ లేక పోవడం వల్ల కింది స్థాయి గ్యాస్ పంపిణీ సిబ్బంది నిబంధనలకు భిన్నంగా దళారులకు గ్యాస్ బండలు అక్రమంగా అమ్మకాలు చేస్తూ అసలైన లబ్ధిదారులకు దగా చేస్తున్నారని ఇక్కడ పెద్ద చర్చ సాగుతుంది. అధికారులు తనికీలు చేస్తే గ్రామాల్లో అక్రమ గ్యాస్ నిల్వలు ఉన్నట్టు సమాచారం. గ్యాస్ లబ్ధిదారుల ఫోన్ నెంబర్లు వివరాలు గ్యాస్ వేన్ డ్రైవర్ వద్ద ఎందుకు ఉన్నాయి. గ్యాస్ అవసరం అయితే గ్యాస్ పింపిణీకు ఆన్‌లైన్లో బుక్ చేస్తే ఆయా లబ్ధిదారులు ఇంటికి గ్యాస్ బండను సరఫరా చేయాలిసి ఉంది. కాని ఆలా కాకుండా బాబు గ్యాస్ బండి ఎక్కడ ఉంది ఎప్పుడు వస్తావు మాగ్రామానికి.. అని బుక్ చేసిన గ్యాస్ లబ్ధిదారులు ఆ గ్యాస్ బండి డ్రైవర్‌కు పలు సార్లు ఫోన్లు చేయడం చూస్తుంటే గ్యాస్ లబ్ధిదారులకు ఉన్న కష్టాలు వర్ణాతీతమని చెప్పక తప్పదు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని గ్యాస్ వినియోగదారులు కోరుతున్నారు.

## అందరూ ఆరోగ్యంగా ఉండాలి

### చిన్మయ మిషన్ నరసన్నపేట బ్రాంచి నిర్వాహకులు స్వామి పరాత్మానంద సరస్వతి

**శ్రీకాకుళం టౌన్, జూన్ 20(వార్త):** ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండాలని అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని చిన్మయ మిషన్ నరసన్నపేట బ్రాంచి నిర్వాహకులు స్వామి పరాత్మానంద సరస్వతి అన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా చైర్పర్సన్ పి.ఉమ ఆధ్వర్యంలో నరసన్నపేట చిన్మయ సంస్థ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చినప్పుడే సమాజంలో సేవా కార్యక్రమాలను విస్తరించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన ఏపిడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకే పరిమితం కాకుండా సమాజ హిత కార్యక్రమాలను జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ (ఎన్సీఆర్సి) జిల్లా శాఖ చేపడుతూనే ఉందని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఎన్సిఆర్సి జిల్లా చైర్పర్సన్ పుక్కళ్ల ఉమ, బిహెచిర్సి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మణిశర్మ, ఎన్సీఆర్సి, బిహెచిరి టీమ్ సభ్యులు స్వరూప్, ఉమామహేశ్వరి, బిందు మోషిత తదితరులు మాట్లాడారు. మెడికవర్ ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు డాక్టర్ కె.ప్రభు, డాక్టర్ వినయ్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా ఆసుపత్రి సిబ్బంది టి. నీలవేణి, ఎం. కుశమ, మాధవరావు, శ్రీలక్ష్మీనరసింహ, కోలాట భజన బృందం వ్యవస్థాపకురాలు సంతోషి, ధనలక్ష్మీ, ప్రశాంతి, మెగా, రవి, ఎం.సుధాకర్, కరుణశ్రీ, శ్రీరామ్మూర్తి, కె.ఎల్.ఎన్.మూర్తి సహకారం అందించారు.

## సేవా దృక్పథంతో పని చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం రెవిన్యూ డే సందర్భంగా శ్రీకా కుళం పట్టణంలోని స్థానిక రెవిన్యూ అతిథి భవనంలో రెవిన్యూ జెండాను శ్రీకాకుళం జిల్లా రెవిన్యూ సర్వీసుల సంఘం అధ్య క్షుడు కె.శ్రీరాములు ఎగురవేశారు. అనంతరం రెవిన్యూ శాఖ యొక్క ఔన్నత్యాన్ని కొనియాడుతూ ప్రజలతో రెవిన్యూ శాఖలో ఉన్న ఉద్యోగులు అందరు కూడా సేవా దృక్పథంతో పనిచేయా లని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత తహసిల్దార్లు యం.వి.సూర్యనారాయణ, జల్లెపల్లి రామారావు, యం.కాళిప్రసాద్‌ను దుశ్శాలువతో సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వేణుగోపాల రావు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్.రాజు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు యస్.దిలీప్ చక్రవర్తి, మురళీధర్ నాయక్, డి.పద్మావతి, శ్రీకాకుళం డివిజన్ అధ్యక్షులు యస్.కిరణ్ కుమార్, కార్యదర్శి డి.ప్రకాశరావు, పలాస డివిజన్ అధ్యక్షులు ఆర్.రామారావు, టెక్కలి డివిజన్ కార్యదర్శి ఆర్.రవికుమార్ రెవిన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.




### ఆమదాలవలస-శ్రీకాకుళం

## రోడ్డు పూర్తి చేయండి

### మంత్రిని కోరిన ఎమ్మెల్యే కూన

**ఆమదాలవలస, జూన్ 20 (వార్త):** ఆమదాలవలస నుంచి శ్రీకాకు ళానికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మా ణపు పనులు అసంపూర్తిగా ఉందని, తక్షణం నిర్మాణం పూర్తి చేసేలా చూడా లని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రహదారులు, భవనాలు శాఖామంత్రి బీసీ కామా ౦డ్డిని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. అమరావతిలోని మంత్రి ఛాంబర్‌లో కూన రవి కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రితో కూన రవి మాట్లాడుతూ గత ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయా యన్నారు. దీనికి మంత్రి స్పందిస్తూ త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు.





## విద్యార్థి చదువుకు వాకర్స్ చేయూత

**శ్రీకాకుళం టౌన్, జూన్ 20 (వార్త):** శ్రీకాకుళం నగరంలోని వాంబే కాలనీకు చెందిన నిరుపేద విద్యార్థి.. చింతగడ దివ్యశ్రీ ఇంటర్మీడియేట్ పరీక్షల్లో 979 మార్కులు సంపాదించి జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో 3700 రాంక్ సంపాదించి త్వరలో ఐఐటీ లేదా ఎన్ఐటీ లో ప్రవేశం పొందనుంది. ఈమె చదవుకు పేదరికం అడ్డుగా నిలిచిన విషయం తెలిసికొని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గురువారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో 15 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు.. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బి వి రవిశంకర్, బి. దేవీ ప్రసాద్ వాకర్స్ సంఘాల కో ఆర్డినేటర్ ఎస్. జోగినాయుడు మాట్లాడుతూ పేదరికం చదువుకు అడ్డు కాకూడదనే ఉద్దేశంతోనే నడక సంఘాల సభ్యులు అంతా ముందుకు వచ్చి దివ్య తేజశ్రీ కు ఆర్థిక సహాయాన్ని అందించామని అన్నారు. కార్యక్రమంలో జేసీఐ మణిశర్మ పాల్గొన్నారు.



## బోరుభద్రలో న్యాయ విజ్ఞాన సదస్సు

**సంతబొమ్మాళి, జూన్ 20 (వార్త):** బోరుభద్ర గ్రామంలో కోటబొమ్మాళి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.ఎం.ఆర్. ప్రసన్న లత ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ప్రసన్న లత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. వాతావరణం కాలుష్యం కాకుండా ప్రతి ఒక్కరు తమ వంతుగా పాటుపడాలని కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. మండల న్యాయ సంఘం ద్వారా ఉచిత న్యాయ సలహాలు అందిస్తారని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని, వ్యర్థాలను తగ్గించాలని తెలిపారు. మూడు లక్షల వార్షిక ఆదాయం ఉన్న మహిళలకు పిల్లలకు ఎస్సీ ఎస్టీ వర్గాలకు పారిశ్రామిక కార్మికులకు జైలు ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని తెలిపారు. న్యాయ సహాయ ఫోన్ నెంబర్ 08942 238322 కు సంప్రదించవచ్చన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లక్కినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఒక్కొక్క మొక్కని పెంచాలని కోరారు. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి మొక్కలు పెంచడం చాలా అవసరమన్నారు. అనంతరం బోరుభద్రలో మెడికల్ క్యాంపు ప్రారంభించారు. రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఎల్. సంధ్యారాణి, పి. స్వాతి, శ్రీలక్ష్మి, స్థానిక సర్పంచ్ బి.లక్ష్మీకాంతం, చింతాడ చిన్నారావు పాల్గొన్నారు.

## రైతులకు విత్తనాలు పంపిణీ



**సంతబొమ్మాళి, జూన్ 20(వార్త):** మండల కేంద్రం సంతబొమ్మాళి రైతు భరోసా కేంద్రంలో రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న వరి విత్తనాలను గురువారం రైతులకు అందించారు. గ్రామ పంచాయతీ టీడీపీ నేతల ఆధ్వర్యంలో రైతులకు ఈ విత్తనాలు పంపిణీ స్తున్నారు. గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కూచెట్టి కాంతారావు, పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు చల్ల జగ్గారావు, అల్లు రమేష్, శిమ్మ వైకుంఠరావు ఆధ్వర్యంలో విత్తనాలు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వరి విత్తనాలు ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబు.. ప్రజల రుణం తీర్చుకుంటారు

**బూర్జ, జూన్20(వార్త):** రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి అత్యధిక సంఖ్య లో అభిమానం చూపించి విజయం అందించిన ప్రజల రుణం తీర్చుకు నేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కంకణం కట్టుకున్నారని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు, తెలుగుదేశం పార్టీ యువజన విభా గం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనెపు రామకృష్ణ నాయుడు అన్నారు. గురువారం కే.కే. రాజపురం, తోటవాడ, గుత్తావల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందించిన బ్యాగ్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టు, షూలను విద్యార్థు లకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో గుర్తింపు తీసుకువచ్చే విద్యను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుందని, ఎమ్మెల్యే కూన రవికుమార్ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం అందించే ఈ కిట్లను సద్వినియోగం చేసుకొని ఇష్టపడి చదివి ఉన్నతులుగా ఎదగాలని వారు కోరారు. అనంతరం సర్పంచ్ కొరికాన వెంకట శివసాయి సీతారామరాజు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ధనుంజయరావు, కమిటీ సభ్యులు హనుమంతు గోపి, కత్తెర అశోక్, ప్రధానోపాధ్యాయురాలు మాలశ్రీ, విద్యా కమిటీ చైర్మన్ గున రమణమ్మ, గ్రామ పెద్దలు కొరికాన వెంకటరావు, కొరికానా అరుణ్ కుమార్, కొరికాను వాసు, దేవాడ శ్రీనివాసరావు, రామ్మూర్తి, పేరుకట్ల ప్రభాకర్ రావు, ఉపాధ్యాయులు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

## విక్రంపురంలో విజయోత్సవ ర్యాలీ



**వీరఘట్టం, జూన్ 20 (వార్త):** విక్రంపురం గ్రామంలో గురువారం మండల తెలుగు యువత అధ్యక్షులు మాచర్ల అనిల్ బాబు, మాచర్ల గీతా నందీశ్వరరావు ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ తరపున ఎమ్మెల్యేగా నిమ్మక జయకృష్ణ అత్యంత, అఖండ విజయం సాదించడంతో గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ సంబరాల్లో పాల్గొని కేరింతలు కొడుతూ, సంతోషాలతో గడిపి జయహో జయహో చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, లోకేష్ అంటూ నినాదాలు చేశారు.

# సందేశాత్మక లఘు చిత్రానికి నగదు బహుమతి

### * 26న సైకిల్ ర్యాలీలో యువత ఉత్సాహంగా పాల్గొనాలి * ఎస్పీ జి.ఆర్ రాధిక

**శ్రీకాకుళం క్రైం, జూన్20 (వార్త):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు గురించి ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించేలా మూడు నిమిషాలు గల ఓ లఘు చిత్రాన్ని చిత్రీకరించి 6309990940 (పిఆర్వో) ఈనెల 25న ఉదయానికి వాట్సాప్ ద్వారా (హెచ్.డి క్వాలిటీ)పంపించాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక కోరారు. లఘు చిత్రాలను ఎంపిక చేసి మొదటి బహుమతినకు 5వేలు, ద్వితీయ బహుమతినకు 3 వేలు నగదు బహుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. జూన్ 26 వ తేదిన ఉదయం ఆర్ట్స్ కళాశాల నుంచి ఏడు రోడ్ల జంక్షన్ వరకు ఒక కిలోమీటరు వరకూ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తామని, ఈ అవగాహన ర్యాలీ లో యువత ఉత్సాహంగా పాల్గొనాలన్నారు.



### మొబైల్‌కు లాక్, సెక్యూరిటీ తప్పనిసరి

మొబైల్ ఫోన్లు వాడే ప్రతీ ఒక్కరు ఫోన్లుకు లాక్ అండ్ సెక్యూరిటి తప్పనిసరిగా వేసుకోవాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక పేర్కోన్నారు. అందుబాటులో ఉన్న కొత్త సాఫ్ట్వేర్లు ద్వారా ఫోన్లులో ఉండే డేటాకు సెక్యూరిటీ వేసుకోవాలన్నారు.మొబైల్ ఫోన్ కొనుగోలు చేసిన అనంతరం బిల్లు, ఐఎంఈఐ నెంబర్,ఇతర వివరాలు భద్రంగా ఉంచుకోవాలన్నారు. విలువైన సమాచారాన్ని ఫోన్లు ఉంచకుండా జాగ్రత్త వహించాలన్నారు. జిల్లాలోని మొబైల్ ఫోన్లు పొగట్టుకున్న బాధితలు ఇచ్చిన సమాచారం మేరకు మొబైల్ ఫోన్లు ట్రేస్ చేసి బాదితలకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయలో జిల్లా ఎస్పీ అందజేసారు. పోగొట్టుకున్న విలువైన మొబైల్ రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో కృషి చేసిన సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పి గారు ప్రత్యేకంగా అభినందించారు. మొబైల్ పోగొట్టుకున్న బాధితులు డిపార్ట్మెంట్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఉన్న సెంట్రల్ ఎక్విపెమెంట్ ఐడెంటి రిజిస్టర్ పోర్టల్ ద్వారా ceir.gov.in అనే పబ్లిక్ వెబ్ సైట్ లో పోగొట్టుకున్న మొబైల్‌ను తిరిగి పొందుటకు గాను బ్లాకింగ్ రిక్వెస్ట్ ను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మొబైల్ ఐఎంఈఐ నెంబర్లు బ్లాక్ అయిన తరువాత ఆ రిక్వెస్ట్‌ను రిసీవ్ చేసుకుని, సదరు మొబైల్‌ను ట్రాక్ చేసి, రికవరీ చేసిన తరువాత మొబైల్ ను, అన్ బ్లాక్ చేసి మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తికి సదరు మొబైల్‌ను ఇస్తున్నామన్నారు. సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ఇప్పటివరకు 202 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఇవ్వడం జరిగిందన్నారు. కొత్తగా ఇప్పటివరకు రికవరీ చేసిన 72 ఫోన్లను గురువారం జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు డా.జి.ప్రేమ్ కాజల్, వి. ఉమామహేష్ రావు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, సైబర్ సెల్ సిబ్బంది రమేష్, శేష గిరి, శరత్, అరవింద్, సత్యనారాయణ, సుదీర్ పాల్గొన్నారు.

### హొంగార్డుకి చెక్కు అందజేత

శ్రీకాకుళం జిల్లా హెూమ్ గార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తించి ఏప్రిల్ నెలలో ఉద్యోగ విరమణ పొందిన హెూమ్ గార్డు గొర్లే రాజునకు జిల్లాలో గల సహచర హెూమ్ గార్డు ఉద్యోగస్తులు స్వతహాగా అందరూ కలిసి ఒక్కరోజు గౌరవ వేతనాన్ని సేకరించిన సుమారు 4.17లక్షల రూపాయల నగదు చెక్కును అందజేశారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పి జి.ఆర్.రాధిక చేతుల మీదుగా ఆ చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనగదును భవిష్యత్తు, కుటుంబ అవసరాలు మేరకు ఉపయోగించుకోవాలని, ఆరోగ్యం పై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్ కాజల్, ఆర్.ఐ. సురేష్ ఉన్నారు.



## విద్యాభివృద్ధికి పెద్దపీట



**ఆమదాలవలస, జూన్ 20 (వార్త):** టీడీపీ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని తెలుగుదేశం పార్టీ మండల అధికార ప్రతినిధి తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. గురువారం తొగారం ఉన్నత పాఠశాలలో విద్య కానుక కిట్లతోపాటు, పుస్తకములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరూ అమ్మఒడి, అనేక పథకాలు వర్తిస్తాయని వివరించారు. ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి సనపల బిల్లేశ్వరరావు, హెచ్ఎం పోలినాయుడు, పేడాడ కృష్ణారావు, బొడ్డేపల్లి సురేష్, హనుమంత సత్యనారాయణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రాఘవాచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



**ఆమదాలవలస, జూన్20 (వార్త):** ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అని టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి సనపల ఢిల్లీశ్వరరావు అన్నారు. గురువారం పట్టణములో ఉన్న జ్యోతి రావు పూలే పాఠశాలలో విద్యార్థులకు పుస్తకములు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యను నిర్వీర్యం చేశారని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళీరావ్, ప్రిన్సిపాల్ గురుగుబెల్లి వాసుదేవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ వ్యవస్థపై తెలుసుకోండి




**ఆమదాలవలస, జూన్20 (వార్త):** ప్రతి ఒక్కరూ బ్యాంకింగ్ వ్యవస్థ, డిపాజిట్ ఖాతాల గురించి పూర్తిగా తెలుసుకోవాలని స్థానిక యూనియన్ బ్యాంకు మేనేజర్ సిహెచ్ రవికుమార్ అన్నారు. గురువారం వెంకటేశ్వర ఐటిఐ కాలేజీలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎవర్నెస్ వర్క్ షాప్ కు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా బ్యాంకింగ్ ఫోల్డర్‌లో చేరాలన్నారు. ఈ వర్క్ షాప్ సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ వి ఆంజనేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి అశోక్ కుమార్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈవర్క్ షాప్‌లో రీసోర్సుపర్సన్లు హరినాథ్, సిహెచ్ వెంకటేష్, రామారావు, కాలేజీ డైరెక్టర్ కూన బానోజీరావు, అధ్యాపకులు ప్రసాదరావు, శ్రీనివాసరావు, నాగభూషణం, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## అశ్లీల నృత్యాలపై భగ్గుమన్న మహిళా సంఘాలు

**పలాస, జూన్20 (వార్త):** సంతబొమ్మాళి మండలంలో అశ్లీల నృత్యాలపై మహిళా సంఘాలు భగ్గుమన్నాయి. ఇటువంటి నృత్యాలను ఖండిస్తున్నామని ప్రగతిశీల మహిళా సంఘం శ్రీకాకుళం జిల్లా కమిటీ ప్రతినిధులు తెలిపారు. అమ్మవారి సంబరాల్లో ఇటువంటి నృత్యాలేంటని, పోలీసులు ఏం చేస్తున్నారని నిలదీశారు.

## మంత్రి నాదెండ్లను కలిసిన జనసేన నాయకులు

**వీరఘట్టం, జూన్ 20 (వార్త):** మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి, జనసేన పార్టీ పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ ను జనసేన పార్టీ క్రియాశీల వాలంటీర్ మత్స పుండరీకం, క్రియాశీలక సభ్యుడు గొడబ మహేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మత్స పుండరీకం గత ప్రభుత్వం బియ్యం బండిని కూటమి ప్రభుత్వం కొనసాగించి మొదట పదిహేను రోజులు రేషన్ పంపిణీ చేసి తరువాత పదిహేను రోజులు రైతు భరోసా కేంద్రంకి అనుసంధానం చేసి రైతుల ఇంటికి ఎరువులు విత్తనాలు తీసుకువెళ్లే విధంగా ఉచిత రవాణా కోసం వినియోగించే విధంగా మార్పులు చేయాలని వారు మంత్రిని కోరారు. వారు మంత్రికి వినతిపత్రాన్ని అందించారు.



## సాగునీటి కాలువల్లో తట్టెడు మన్ను తీయలేదు

### వైసీపీ పాలనపై భగ్గుమన్న ఎమ్మెల్యే శంకర్

**శ్రీకాకుళం టౌన్, జూన్ 20 (వార్త):** మానవ మనుగడకు ప్రధానమైన వ్యవసాయ రంగాన్ని వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే గొండు శంకర్ మండిపడ్డారు. పార్టీ పేరులో రైతును వెనుక బెట్టిన విధంగానే రైతాంగ సంక్షేమాన్ని చిట్టా చివరికి నెట్టేసారని ఆరోపించారు. శ్రీకాకుళం గ్రామీణ మండల పరిధిలోని చింతాడ వద్ద వంశధార కుడి ప్రధాన కాలువ ఎత్తిపోతల పధకాన్ని ఆయకట్టు రైతులు, టీడీపీ నేతలతో కలసి అయన గురువారం పరిశీలించారు. ప్రధాన కాలువను అనుసరించి అంపోలు వరకు పర్యటించిన అయన కాలువ పనుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసారు. కాలువ పనుల పరిశీలన గురించి ముందుగానే సమాచారం ఇచ్చినా సంబంధిత ఉన్నతాధికారులు రాకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేసారు. గార మండల శివారు భూములకు నీరందించే వంశధార కుడి ప్రధాన కాలువ నిర్వహణ గాలికి వదిలేసారని విమర్శించారు. రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. చిట్ట చివరి భూములకు కూడా సాగు నీరందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. వ్యవసాయదారితమైన జిల్లాకు చెందిన అచ్చెనాయుడు వ్యవసాయ శాఖమంత్రిగా రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. చివరి భూమల వరకు సాగునీరు అందజేసి రైతాంగానికి అండగా ఉంటామని గొండు శంకర్ భరోసా ఇచ్చారు.

# ప్రమాదకర మలుపులు

### పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

**వజ్రపుకొత్తూరు, జూన్ 20 (వార్త):** మంచినీళ్లపేట వయా పెద్ద మురహరిపురం పూండీ వెళ్లే రోడ్డు దారి పొడవున ప్రమాదకర మలుపులు ఉండటం వల్ల వాహన చోదకులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వర్షాలకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న బెర్మ్‌లు కూడా పాడై పోయాయి. దీనికి తోడు జంగెల్ క్లియరెన్స్ కూడా లేదు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు కొమ్మలు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో ఈ రూటులో ప్రయాణం చేయాలంటే భయ పడతారు. ప్రమాదకర మలుపులు వద్ద హెచ్చెరిక బోర్డులు కూడా లేవు. ఈ రూటు లో ప్రతి రోజు ఎదో ఒక చోట ఆక్సిడెంట్లు జరుగుతునే ఉంటాయి. సుమారు 10 కిలో మీటర్లు పొడవున్న ఈ రూటులో సుమారు 20వరకు ప్రమాదకర మలుపులు ఉన్నాయి. రోడ్డు కు మధ్య మధ్యలో గుంతలు వల్ల ప్రయాణీకులతో పాటు ఆటోలు, వ్యాన్ లు,ఆర్ టీ సి బస్ లు, ద్విచక్ర వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఈ రోడ్డు మరమ్మత్తులు చేయాలని ఎన్ని మార్లు పత్రికల్లో వార్తలు వచ్చినాపట్టించు కున్న నాధుడు లేక నిర్లక్ష్యపు నీడలో కొట్టు మిట్టాడు తోంది. గత ప్రభుత్వ పాలనలో ఎటువంటి మరమ్మత్తులు లేక నిర్లక్ష్యానికి గురైందని ఈ ప్రాంతీయులు ఆవేదన చెందుతున్నారు. ఈ రూటు లో మరిన్ని ప్రమాదాలు జరగక ముందే ఈ రోడ్డుకు వెంటాడుతున్న సమస్యలు పరిష్కరించాలని, నూతన ప్రభుత్వ హయాంలో నైనా సమస్యలు పట్ల దృష్టి సారించి త్వరిత గతిన రోడ్డు మరమ్మత్తు పనులు జరిపించాలని పలువురు కోరుతున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## బీపీ నాయుడుకు ఘన సన్మానం



**వీరఘట్టం, జూన్ 20 (వార్త):** ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన కార్యదర్శిగా బి. పి. నాయుడుని నియమించినందుకు ఆయనను గురువారం ఘనంగా సన్మానించారు ఈయన్ను నియమించినందుకు గాను జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ముందుగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ బీపీ నాయుడు ఆధ్వర్యంలో జనసేన పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని ఈయన నియామకం ఎంతో హర్షణీయకమని కొనియాడారు. పార్టీ బలోపేతానికి అందరినీ ఆకట్టుకుని మరింత కృషి చేయాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విజయ కుమార్, బాబురావు, భూపతి జయలక్ష్మి, కె.రామారావు, కె. శేషగిరి రావు, టి.బలరామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రామోజీరావు.. అక్షర యోధుడు

## శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

**శ్రీకాకుళం టౌన్, జూన్ 20 (వార్త):** సమ సమాజ స్థాపనకు రామోజీ అక్షరాలతో సమరం చేశారని, రామోజీరావు మృతి తీరనిలోటని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నాగవలి హోటల్ లో లైన్స్ క్లబ్ శ్రీకాకుళం ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో రామోజీరావు సమస్మరణ సభ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గొండు శంకర్ ముందుగా రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ జర్నలిజంలో నూతన ఒరవడిని ప్రవేశపెట్టిన గొప్ప దార్శనికుడని కొనియాడారు. పేదవర్గాలకు అండగా ఆయన కథనాలు ఎంతో దోహదపడ్డా యన్నారు. తెలుగు పాత్రికేయతకు రామోజీరావు విశ్వసనీయత జోడించారని, మీడియా రంగానికి ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. ఎన్నో రంగాల్లో ఆయన వ్యాపార సంస్థలను ఆరంబించి నిజాయితీకి మారుపేరుగా సంస్థలను నడిపారని ప్రశంసించారు. ఆయన నడిచిన మార్గం ప్రజలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో దాతలను అభినందించారు. ప్రపంచస్థాయి ఫిలింసిటీని ఏర్పాటు చేసి ఎందరో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జోనల్ చైర్మన్ నటుకుల మోహన్, అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, బాడన దేవ భూషణ్, మైలిపల్లి నరసింహమూర్తి, ఇప్పిలి తిరుమల రావు, జేసిఐ అధ్యక్షులు బెందాళం వరలక్ష్మి, దూసి సంతోష్, శిల్లా మణి, తదితరులు పాల్గొన్నారు.



### రెవెన్యూ సేవలు ప్రజలకు చేరువ కావాలి

రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందించే సేవలపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ సూచించారు.స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో రెవిన్యూ డివిజనల్ అధికారి సి. హెచ్.రంగయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన రెవిన్యూ దినోత్సవానికి శాసనసభ్యులు గొండు శంకర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో రెవిన్యూ శాఖ కీలకమైనదన్నారు. ప్రజలతో రెవిన్యూ ఉద్యోగులు సత్సంబంధాలు కొనసాగించాలని, ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వ పధకములు ప్రజలకు చేరువ చేయడంలో ముందుండాలన్నారు. అనంతరం విశ్రాంత రెవిన్యూ డివిజనల్ అధికారి పి.యం.జె.బాబు, విశ్రాంత తహసిల్దార్లు ఎన్.ఆర్. రవీంద్రనాద్, యస్.మోహనరావు, డి.చంద్రశేఖర్, జి.సురేష్, పి.రాంబాబు తదితరులను విధినిర్వహణలో వారి సేవలు కొనియాడుతూ గొండు శంకర్ దుశ్శాలువలతో సత్కరించి, గౌరవించడం జరిగింది. రెవిన్యూ శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల సేవలకుగాను గుర్తిస్తూ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ బి.వి.రాణి, ఉప తహసిల్దార్ బి.వి.వి.ఎన్.రాజు, కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవిన్యూ అధికార్లు, వార్డు రెవిన్యూ కార్యదర్శులు, గ్రామ సర్వే సహాయకులు, గ్రామ రెవిన్యూ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఆమదాలవలస రహదారి పనుల పరిశీలన

శ్రీకాకుళం-ఆమదాలవలస ప్రధాన రహదారి మరమ్మతు పనులకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. మృత్యుమార్గంగా మారిన శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి మరమ్మతు పనులను రాగోలు, వాకలవలస సమీపంలో గురువారం శాసనసభ్యులు గొండు శంకర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ, శ్రీకాకుళం రైల్వే స్టేషన్కు చేరుకునే ప్రధానమైన శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డు అధ్వాన్నంగా మారడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేసారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా సోమవారం జిల్లాకు తొలిసారి విచ్చేసిన కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెనాయుడు తన అభ్యర్ధన మేరకు రోడ్డు నిర్మాణానికి సానుకూలంగా స్పందించడం జరిగిందని, ఆత్మీయ అభినందన వేదిక మీదనే కాంట్రాక్టర్ కు హెచ్చరిక జారీ చేయడంతో మరమ్మతు పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు, ప్రమాదాలను నివారించేందుకు గాను గుంటలను పుడ్చే చర్యలను చేపట్టామన్నారు. పనులు జరుగుతున్నందున ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని, ప్రజలు సహకరించాలని అయన కోరారు. తాను కోరిన వెంటనే ఆదేశాలు జారీ చేసిన మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడులకు గొండు శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.





### రెవెన్యూ శాఖలో
## పనిచేయడానికి గర్వపడాలి

**వీరఘట్టం, జూన్ 20 (వార్త):** రెవెన్యూ శాఖలో పనిచేయడానికి గర్వపడాలని తహశీల్దార్ జయప్రకాష్ అన్నారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు ముందుగా రెవెన్యూ డే సందర్భంగా రెవిన్యూ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ శాఖ ఒక వ్యవస్థ అని, రెవిన్యూ శాఖలో ఎక్కువ మొత్తంలో నవీకరణ విషయాలు ఉంటాయని, ఎప్పటికప్పుడు ఉద్యోగులు అప్డేట్ కావలసిన అవసరం ఉంటుందని ఆయన అన్నారు. తెలియని విషయాలు నేర్చుకోవడంలో చిన్న, పెద్ద ఉద్యోగి అనే భావన ఉండకూడదని పేర్కొన్నారు. ఎన్నికలు, ప్రకృతి వైపరీత్యాలు, ఇలా తదితర అంశాలలో రెవెన్యూ శాఖ ప్రాముఖ్యత చాలా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు ఈస్ట్ ఇండియా పాలకులు 1786 జూన్ 20న రెవెన్యూ బోర్డు ఏర్పాటు చేశారని, ఆ బోర్డు ఏర్పాటైన జూన్ 20వ తేదీన రెవెన్యూ డే చేసుకోవడం జరుగుతోందని ఆయన చెప్పారు. శాఖ ఏర్పడి 238 సంవత్సరాలు అయిందని ఆయన పేర్కొన్నారు. ప్రతి ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. రెవెన్యూ శాఖను ఉన్నతికి, అభివృద్ధికి, సిబ్బంది అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ .ఐ లక్షున్నాయుడు, రిటైర్డ్ విఆర్ ఉదయాన రామ్మూర్తి నాయుడు, వీఆర్వోలు పొన్నాడ వెంకట రఘు కుమార్, గంటా సురేష్ కుమార్, గేదెల అప్పలనాయుడు, రాజేంద్రప్రసాద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 22న పోలీసు చెరువు వేలం పాట

**శ్రీకాకుళం క్రైం, జూన్ 20.(వార్త)** జిల్లా ఆర్మ్ రిజర్వ్ పోలీసు విభాగం ఎచ్చెర్ల నందు ఉన్న చేపల చెరువు ఒక సంవత్సర కాలానికి వేలం వేయబడునని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు జిల్లా ఆర్మ్ రిజర్వ్ పోలీసు విభాగం ఎచ్చెర్లలో ఈనెల 22న జరిగే వేలంలో పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు వ్యక్తిగత వివరాలు, గుర్తింపు కార్డుతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు,ఇతర సమాచారం కోరకు రిజర్వ్ ఇన్స్పెక్టర్ (వెల్ఫేర్), కే.వీ. నాగేశ్వరరావు, మొబైల్ నెంబర్ 6309990841 సంప్రదించగలరు.

# కష్టాల కడలిలో గంగపుత్రులు

*** దళారులు చెప్పిందే రేటు * వేటాడిన మత్స్యసంపదపై వారిదే పెత్తనం**
*** సర్కారుకు ఆదాయం వస్తున్నా మత్స్యకారులను పట్టించుకోని వైనం**

**పలాస, జూన్ 20 (వార్త):** రాష్ట్రంలో మత్స్య సంపద ఎగుమతులు వల్ల సర్కార్‌కు కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నప్పటికీ వేట చేసే మత్స్య కారులకు పూట గడవని పరిస్థితుల్లో ఉన్నారు. ఇక్కడ వేటాడిన చేపలు నిల్వ చేసేందుకు వీలుగా కోల్డ్ స్టోరేజ్, జట్టీలు లేక పోవడం వల్ల ఇతర ప్రాంతాలకు వేటకు వెళుతున్నారు. సముద్ర మత్స్య సంపద ఎగుమతుల్లో 5510 కోట్ల రూపాయలు చేపలు, 40వేల కోట్లు విలువైన రొయ్యలు ఎగుమతులు ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని మత్స్యశాఖ ఉన్నత అధికారులు వెల్లడించారు. సముద్ర మత్స్య ఉత్పత్తుల ఎగుమతులు 2023-24లో రికార్డ్ నమోదు చేశాయని సముద్ర ఉత్పత్తి ఎగుమతుల సంస్థ వెల్లడించింది. ఇక్కడ వేటాడిన రొయ్యలు, చేపలు ఇతర దేశాలకు ఎగుమతులు జరుగుతున్నాయని ఆ సంస్థ తెలిపింది. రొయ్యలు పరిమాణం, రెండింటి పరంగా ప్రధాన ఉత్పత్తి ఎగుమతిగా నిలిచింది. గత ఏడాది తీవ్రమైన మార్కెట్ సవాలు ఎదుర్కొన్నప్పటికీ 17.81వేయి టన్నుల సముద్రపు ఆహారాన్ని దిగుమతి చేయడం ద్వారా ఆల్‌టైం గరిష్ట ఎగుమతులను నమోదు చేసినట్లు ఆసంస్థ వెల్లడించింది. సముద్రాన్ని ప్రధాన జీవనాధారంగా చేసుకుని బతుకుతున్న గంగపుత్రులు ప్రాణాలకు తెగించి వేటాడిన సముద్రం మత్స్య సంపదను తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తుందని మత్స్య కారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీకాకుళంలో 173 కిలోమీటర్లు వరకు సముద్ర తీరం ఉంది. అటు కళింగపట్నం నుంచి, ఇటు బారువ తీరం వరకు సముద్రంపై ఆధారపడి చేపల వేట సాగిస్తున్న మత్స్యకారులు ప్రాణాలు తెగించి వేటాడిన సముద్ర సంపదను నిల్వ చేసుకునేది విడిగా జట్టీలు లేకపోవడంతో దళారులు ఎంత చెప్తే అంత ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉందని ఇక్కడ వేట సాగించే గంగ పుత్రుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కోనేము చేపతో పాటు, వంజరాలు, వాలవులు, సూరాలు ఇలా ఎన్నో రకాల చేపలు వలలకు లభ్యమవుతున్నాయని అయితే నిలువ చేసేందుకు వీలుగా జట్టీలు లేకపోవడం వలన మార్కెట్లో తక్కువ ధరకే అమ్మకాలు చేయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఇలా మధ్య వర్తులు కొన్న సముద్రం సంపద ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ దళారులు లబ్ది పొందుతున్నారని మత్స్యకారులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.





Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413